సాక్షి జగిత్యాల

మంగళవారం : 7 : మార్చి : 2023



వైభవంగా డోలోత్సవం

వేములవాడఅర్బన్: రాజన్న సన్నిధిలో త్రిరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రెండో రోజు డోలోత్సవం నిర్వహించారు.



సమస్యలకు ప్రాధాన్యతనివ్వాలి

ప్రజావాణి సమస్యలకు అధిక ప్రాధాన్యత నిచ్చి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు.

8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం

36.0/19.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలను సత్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్ మకరంద్

జగిత్యాల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అడిషనల్ కలెక్టర్ మంద మకరంద్ అన్నారు. సోమవారం గీతాభవన్‌లో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటికి తోడు జనరల్ స్థానాల్లో మహిళలు పోటీపడటంతో స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులు ఎక్కువగా మహిళలే ఉన్నారన్నారు. అనంతరం మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో చైర్మన్ గోలి శ్రీనివాస్, ఇన్‌చార్జి కమిషనర్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్ రద్దు చేసేవరకు ఆందోళన



రోడ్డుపై బైఠాయించిన రైతులు

జగిత్యాలరూరల్: జగిత్యాల మున్సిపల్‌లోని మాస్టర్‌ప్లాన్‌లో చేర్చిన గ్రామాలను తొలగిస్తూ ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైతులు ఆందోళన చేపట్టారు. జగిత్యాల మున్సిపల్ టౌన్‌ప్లాన్ రద్దు చేస్తున్నట్లు కేవలం మున్సిపల్‌లో తీర్మానం మాత్రమే చేశారని, తీర్మానం చేసి చాలా రోజులు గడుస్తున్నా రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం లేదని నిరసిస్తూ సోమవారం జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన రైతులు నల్లగుట్ట వద్ద జగిత్యాల–గొల్లపల్లి ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. తిమ్మాపూర్ గ్రామాన్ని రిక్రియేషన్ జోన్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై అనిల్ ఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి ఆందోళన విరమించారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



చెక్కులు అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి: తక్కువ వడ్డీతో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించాలని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురిలోని ప్రాథమిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం పలువురు రైతులకు రూ.8.20 లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేసారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, సాగు పెట్టుబడులు, ఇతరత్రా అవసరాలకు సంఘం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శేర్ల రాజేశం, డైరెక్టర్లు ఎల్లాగౌడ్, లింగన్న, కుమ్మరి రవి, నూర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బృందం సభ్యులు

సారంగాపూర్(జగిత్యాల): పటిష్ట ప్రణాళికతో పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు కష్టపడాలని జిల్లా పర్యవేక్షణ బృందం సభ్యుల లీడర్ తిరుకోవెల నరేందర్ (అర్పపల్లి హెచ్‌ఎం) పేర్కొన్నారు. సోమవారం బీర్‌పూర్ మండలం తుంగూర్, బీర్‌పూర్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఏలా ముందుకు వెళ్లాలన్న అంశాలపై వివరించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారు మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించి మంచి మార్కులతో ఉత్తీర్ణత కావడానికి ఏలా సిద్ధం చేయాలన్న దానిపై మెలకువలు నేర్పారు. కార్యక్రమంలో బృందం సభ్యులు రాజశేఖర్, లచ్చన్న, జయంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే కొండగట్టు అభివృద్ధి



పాదయాత్రలో రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, నాయకులు



కొండగట్టు ఆలయంలో రేవంత్‌రెడ్డి పూజలు

- అధికారంలోకి రాగానే మరిన్ని వసతులు కల్పిస్తాం
- బస్సు ప్రమాద బాధితులకు ఎలాంటి సాయమూ అందలేదు
- నాడు ఆ ఘటనపై సీఎం స్పందించకపోవడం సిగ్గుచేటు
- హాథ్ సే హాథ్ జోడోలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

కొండగట్టు/కొడిమ్యాల: కాంగ్రెస్ హయాంలోనే కొండగట్టు ఆలయ అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొండగట్టును మరింత అభివృద్ధి చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హాథ్ సే హాథ్ జోడోయాత్రలో భాగంగా సోమవారం కొండగట్టులోని శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ మారుతిస్వామి శాలువతో సన్మానించి లడ్డూ ప్రసాదం అందజేశారు. ఆలయ స్థల పురాణం గురించి అర్చకులు వివరించారు. అనంతరం ఆలయ ఆవరణలో మాట్లాడారు. ఘాట్‌రోడ్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో మృతిచెందిన, క్షతగాత్రుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎలాంటి సాయమూ అందలేదన్నారు. నాడు ఆ ఘటనపై సీఎం కేసీఆర్ స్పందించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇటీవల కొండకు వచ్చిన సీఎం ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని వాగ్దానం చేశారని, తనకు నమ్మకం లేదన్నారు. 800 ఎకరాల స్థలంలో ఆలయాన్ని గొప్పగా అభివృద్ధి చేయవచ్చని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ వెంటనే రూ.500 కోట్లు విడుదల చేసి ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొండగట్టు అంజన్న సన్నిధిలో భక్తులకు సకల వసతులు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. కొండపై పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు వారి సమస్యలను రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు.

పోతారం నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలి

కొండగట్టు అంజన్న దర్శనం అనంతరం కొడిమ్యాల మండలం పోతారం పెద్ద చెరువు రిజర్వాయర్‌ను రేవంత్‌రెడ్డి సందర్శించారు. నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. రిజర్వాయర్ నిర్మాణ సమయంలో కోనాపూర్ గ్రామంలోని 135 ఇళ్లకు ఆర్‌ఆర్‌ఆర్ ప్యాకేజీ వర్తిస్తుందని ప్రభుత్వాధికారులు పేర్కొన్నారని, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులు ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఎన్నికైనా ఈ సమస్య ఇప్పటికీ పరిష్కరించలేదని విమర్శించారు. రిజర్వాయర్ సమీపంలోని కొడిమ్యాల–కోరుట్ల రోడ్డుపై గల బుగ్గవాగుపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో వర్షాకాలంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికే ఇద్దరు ప్రాణాలు కోల్పోయారన్నారు. పోతారం రిజర్వాయర్ మత్తడి ఎత్తును పెంచి, బుగ్గవాగుపై బ్రిడ్జిని నిర్మించాలని, నిర్వాసితులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కేవలం రూ.25 కోట్ల వ్యయంతో ఈ మూడు సమస్యలు పరిష్కరించడానికి అవకాశం ఉందన్నారు ఈ సమస్యల పరిష్కారానికి స్థానికుల ద్వారా ప్రజావాణిలో ఫిర్యాదు చేయించడంతోపాటు, ప్రభుత్వంపై ఒత్తిడిని తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. అంతకుముందు కొడిమ్యాలలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. సాయంత్రం పాదయాత్ర పూడురు నుంచి గంగాధర వరకు కొనసాగింది. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, యూత్ కాంగ్రెస్ నాయకుడు నాగి శేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరి నారాయణ, నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, దొంగ ఆనందరెడ్డి, ముత్యం శంకర్, చారి, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రవిశంకర్‌పై చార్జ్‌షీట్ విడుదల

కొడిమ్యాల మండల కేంద్రంలో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవి శంకర్‌పై కాంగ్రెస్ నాయకులు సోమవారం చార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, తొమ్మిదేళ్లయినా పోతారం రిజర్వాయర్ పనులు ఎమ్మెల్యే పూర్తి చేయలేకపోయారని ఆరోపించారు. రెండుసార్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించినా నియోజకవర్గానికి చేసిందేం లేదన్నారు. సొంత గ్రామంలో రైతులపై కక్షగట్టిన కఠినాత్ముడని విమర్శించారు. మళ్లీ కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందన్నారు.

9న కరీంనగర్‌లో కాంగ్రెస్ కవాతు



గంగాధరలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

గంగాధర(చొప్పదండి): ఎన్ని అడ్డంకులు సృష్టించినా కరీంనగర్‌లో ఈనెల 9న కాంగ్రెస్ కవాతు నిర్వహిస్తామని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాకు పాదయాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. కరీంనగర్‌లో కాంగ్రెస్ సభ నిర్వహించేందుకు సీపీ అనుమతి ఇవ్వడం లేదన్నారు. సభను అడ్డుకుంటే ముఖ్యమంత్రిని ప్రగతిభవన్ నుంచి బయటకు రానివ్వమని హెచ్చరించారు. కవాతు సభకు కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన కాంగ్రెస్ పార్టీని ఎందుకు ఓడించారని ప్రజలను ప్రశ్నించిన రేవంత్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో అవకాశం ఇచ్చి రుణం తీర్చుకుందామని పిలుపునిచ్చారు. నేరెళ్ల బాధితుల విషయంలో ఎస్సీ కమిషన్ నివేదిక ఏడేళ్లయినా బయట పెట్టడం లేదని అన్నారు. ఎంపీ బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ చేసిందేమీ లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి చుక్క నీరు రాలేదన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కమీషన్ల కోసం కేసీఆర్ కుటుంబం పనిచేస్తోందని అన్నారు. ప్రాజెక్టుల పేరుతో దోచుకుంటోందని అన్నారు. ఇప్పుడున్న వరదకాలువ ద్వారానే మూడు వందల టీఎంసీల నీటిని తరలించే అవకాశం ఉన్నా.. కమీషన్ల కోసమే మరో కాలువ నిర్మిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, అంజన్‌కుమార్‌యాదవ్, పద్మాకర్‌రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, లక్ష్మణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు

- జిల్లాకు రూ.22.70 కోట్లు
- మహిళా దినోత్సవం రోజున ప్రొసీడింగ్స్ అందజేత



మహిళా సంఘాల సమావేశం (ఫైల్)

జగిత్యాల: మహిళా సంఘాల సభ్యులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న వడ్డీ లేని రుణాలు ప్రకటించడంతో వారిలో ఆనందం వ్యక్తమవుతోంది. మహిళా దినోత్సవం రోజున అధికారులు మహిళా సంఘ సభ్యులకు ప్రొసీడింగ్స్ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాలు ఉండగా ఒక్కో నియోజకవర్గంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గంలో రెండు మండలాలు ఉండగా వారికి ఆ నియోజకవర్గంలో జరిగే సభలో, కోరుట్ల, జగిత్యాల ప్రాంతాల్లో సభలు ఏర్పాటు చేసి ప్రొసీడింగ్స్ అందజేస్తారు. గత నాలుగేళ్లుగా వడ్డీలేని రుణాలు అందకపోవడంతో మహిళలు తీసుకున్న బ్యాంకు లింకేజీ రుణాలకు వడ్డీ కట్టుకుంటూ వస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం మహిళలకు వడ్డీలేని రుణాలు అందజేస్తామని ప్రకటించింది. 2018 వరకు వడ్డీ లేని రుణాలు వచ్చినా 2018–19 సంవత్సరం నుంచి నిలిచిపోయాయి. మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు మహిళలకు వడ్డీలేని రుణాలు అందించేందుకు బడ్జెట్ విడుదల చేశారు.

బడ్జెట్ విడుదల కాగానే..

వడ్డీలేని రుణాలు జిల్లాకు రూ.22.70 కోట్లు రానున్నాయి. 2018–19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 12,213 సంఘాల సభ్యులకు రూ.6.24 కోట్లు, 2019–20 సంవత్సరానికి సంబంధించి 12,463 సంఘాలకు రూ.16.46 కోట్లు విడుదల కానున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ప్రొసిడింగ్స్ మాత్రం అందజేయనున్నారు. బడ్జెట్ విడుదల కాగానే నేరుగా వారి అకౌంట్లలో జమకానున్నాయి. గత రెండు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న మహిళలకు వడ్డీలేని రుణాలు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో మహిళా సంఘం, సభ్యులు రూ.లక్ష రుణం తీసుకొని చెల్లించినవారికి దాదాపు రూ.20 వేల వరకు అందనున్నాయి.

ఏర్పాట్లు చేస్తున్నాం



మహిళా సంఘ సభ్యులకు వడ్డీలేని రుణాలకు సంబంధించిన ప్రొసిడింగ్ అందజేస్తాం. ఈ మేరకు నియోజకవర్గాల వారీగా సభలు ఏర్పాటు చేసి స్థానిక ఎమ్మెల్యేల చేత పంపిణీ చేయిస్తాం. జిల్లాకు రూ.22.70 కోట్లు మంజూరయ్యాయి.

– లక్ష్మీనారాయణ, డీఆర్డీఏ పీడీ

స్వయం ఉపాధి యూనిట్లతో లాభాలు



గానుగ యూనిట్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాస్

జగిత్యాలరూరల్: మహిళలు స్వయం ఉపాధి యూనిట్లను నెలకొల్పి ఆర్థికాభివృద్ధి చెందుతున్నారని రాష్ట్ర సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ సీహెచ్.శ్రీనివాస్ అన్నారు. జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని జాబితాపూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు చేపడుతున్న యూనిట్లను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా సంఘ సభ్యులు ఏర్పాటు చేసుకున్న యూనిట్లు ఆదర్శంగా నిలుస్తున్నాయని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ ఆన్‌లైన్ సంస్థలతో మహిళా సంఘాల నాణ్యమైన ఉత్పత్తులను అమ్మించడంపై ఒప్పందం కుదిరిందన్నారు. ఇందుకోసం సెర్ప్ సిబ్బంది మహిళా ఉత్పత్తులపై దృష్టి సారించాలన్నారు. అలాగే జిల్లాలోని 17 మండలాల్లో రైతుల వ్యవసాయం కోసం పరికరాల అద్దె కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు సంబంధిత మండల మహిళా సంఘాలను సంప్రదించి అద్దె పరికరాలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం ప్రాజెక్ట్ మేనేజర్‌ను సెర్ప్ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఫామ్ అధికారి వెంకటేశం, సర్పంచులు చెరుకు జాన్, అంకం మమత, ఎంపీటీసీలు సునీత, స్వప్న, ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారాం, విద్యాసాగర్, వీవోఏలు రాజ్యలక్ష్మి, భాగ్యలక్ష్మి, మల్లిక, ప్రమోద్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు కేటాయించాలని నిరసన

జగిత్యాలటౌన్: డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని ప్రజావాణిలో దరఖాస్తు చేసేందుకు వెళ్తే అనుమతించడం లేదంటూ పట్టణంలోని పలువురు మహిళలు సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. సెంటు భూమి, సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో కాలం వెల్లదీస్తున్న తమను కాదని ఇళ్లు, ఆస్తులు ఉన్న వారికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో తమకు నూకపెల్లి అర్బన్ హౌజింగ్‌కాలనీలో ఇళ్లు కేటాయించారని, నిర్మాణం ప్రారంభమై ప్రగతిలో ఉండగా(బేస్‌మెట్, లెంటల్ లెవల్)నిర్మాణాలను కూల్చివేసి చదును చేసిన అధికారులు డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ప్రాధాన్యత ఇస్తామని తెలిపారని.. ఇళ్ల కేటాయింపుల్లో తమను పరిగణనలోకి తీసుకోకుండా అన్యాయం చేశారన్నారు. తాను అద్దెకుంటున్న ఇంటి యజమానికి ఇల్లు మంజూరు చేశారని ఓ మహిళ ఆగ్రహం వ్యక్తం చేసింది. పట్టణ పోలీసులు నచ్చచెప్పి ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించగా ఆందోళన విరమించారు.

వైరల్ ఫియర్

- దగ్గు, జలుబు, విరేచనాలు
- మంచానపడుతున్న జనం
- జిల్లాలో విషజ్వరాల విజృంభణ
- రోగులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రులు



- 'ఈ వృద్ధుడి పేరు మల్లయ్య. మెట్‌పల్లి మండలం చౌలమద్దికి చెందిన ఈయన మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా, కుటుంబ సభ్యులు స్థానికంగా చికిత్స చేయించినా తగ్గలేదు. దీంతో సోమవారం మెట్‌పల్లిలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకవెళ్లగా, వైద్యులు ఇన్‌పేషంట్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు.'

మెట్‌పల్లి/రాయికల్/ధర్మపురి: జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ఎడతెగని దగ్గు, జలుబు, విరేచనాలతో ఇబ్బందులు పడుతున్నారు. రెండుమూడు రోజులుగా కుటుంబంలో ఒకరి నుంచి మరొకరికి సోకుతుండగా మంచానికే పరిమితమవుతున్నారు. బాధితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రస్తుతం జ్వరాల సీజన్ కాకున్నా వాతావరణ మార్పులతో పెద్ద సంఖ్యలో జ్వరాల బారినపడుతున్నారు.

మెట్‌పల్లి పరిధిలో..

- పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రితో పాటు 20 ప్రైవేట్ ఆసుపత్రులున్నాయి. ఈ నెల 1 నుంచి 6వ తేదీ వరకు ప్రభుత్వాసుపత్రిలో రోజుకు 200–250 వరకు ఓపీ నమోదవుతోంది.
- ఇందులో 50 మంది వరకు జ్వరాలు, విరోచనాలతో వస్తుండగా, నలుగురైదుగురు ఇన్‌పేషంట్ల వార్డులో చేరుతున్నారని వైద్యులు తెలిపారు.
- రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రభుత్వాసుపత్రిలో అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.
- ఐదు పిల్లల ప్రైవేట్ ఆస్పత్రులు ఉండగా రోజుకు 200పైగా ఓపీ నమోదవుతుంది. చిన్నారులు జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలతో బాధపడుతుండగా తల్లిదండ్రులు చికిత్స కోసం తీసుకవస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అవసరం లేకున్నా రకరకాల పరీక్షలు చేస్తుండడం రోగుల కుటుంబ సభ్యులకు ఇబ్బందిగా మారింది.

చికిత్స విషయంలో జాప్యం వద్దు



ఇది జ్వరాల సీజన్ కాదు. కానీ ప్రస్తుతం జ్వరాలు, విరోచనాల కేసులు ఎక్కువగా వస్తున్నాయి. ఇటీవల ఈ ప్రాంతంలో ఎక్కువగా జాతరలు జరిగాయి. ఆ ప్రభావం వల్ల వ్యాధులు సోకుతున్నాయని భావిస్తున్నాం. జ్వరాల బారిన పడితే వెంటనే చికిత్స తీసుకోవాలి. జాప్యం చేస్తే ప్రాణం మీదకు వచ్చే అవకాశాలుంటాయి.

– అమరేశ్వర్, మెట్‌పల్లి ఆసుపత్రి వైద్యుడు


రాయికల్ పరిధిలో..



రాయికల్ ఆస్పత్రిలో జ్వరపీడితులు

రాయికల్ మున్సిపాలిటీలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో జ్వర పీడితుల తాకిడి పెరిగింది. సోమవారం 183 మంది ఓపీ నమోదు కాగా, ఇందులో ఎక్కువ మంది జ్వరంతో బాధపడుతున్నట్లు వైద్యులు తెలిపారు. రెండుమూడు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నవారిని ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని చికిత్స అందిస్తున్నారు.

గ్లూకోజ్ పెట్టి మందులు ఇచ్చారు



నేను రెండుమూడు రోజులుగా జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్న. ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే జ్వరం ఎక్కువగా ఉందని స్టాఫ్ నర్సులు అడ్మిట్ చేసుకుని గ్లూకోజ్ పెట్టి మందులు ఇచ్చారు.

– లక్ష్మి, చింతలూరు, రాయికల్

అందుబాటులో బెడ్లు, మందులు



రాయికల్ ఆస్పత్రిలో రోగులకు సరిపడా బెడ్లు, మందులు అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడిప్పుడే వైరల్ జ్వరాలు వస్తుండడంతో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాం.

– రవి, రాయికల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

ధర్మపురిలో..



ధర్మపురి ఆస్పత్రిలో వైద్య పరీక్షల కోసం వచ్చిన బాధితులు

ధర్మపురిలో ప్రభుత్వ ఆస్పత్రితో పాటు 3 ప్రైవేట్ ఆస్పత్రులున్నాయి. సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో 180 మంది ఓపీ నమోదు కాగా, వారిలో 30 మంది వరకు వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారు ఉన్నారు. 30 మందిలో 10 మందికి జ్వర తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారు.

జ్వరం వస్తే జగిత్యాలకు తరలించారు



పది రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్న. ధర్మపురిలోని సర్కారు దవాఖానాలో పరీక్షలు చేసిండ్రు. ఎక్కువ జ్వరం ఉండడంతో నాలుగు రోజుల క్రితం 108లో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు కనీసం ముట్టలేదు. 6 తెల్లగోలీలు, 6 ఎర్రగోలీలిచ్చి పంపించారు. ఎటువంటి పరీక్షలు చేయలేదు.

– రాజవ్వ, ధర్మపురి

అప్రమత్తంగా ఉన్నాం



వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉన్నాం. బాధితులకు పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నాం. జ్వర తీవ్రత ఎక్కువగా ఉంటే ఆస్పత్రిలో చేర్చుకొని చికిత్స చేస్తున్నం. రోగులకు సరిపడే బెడ్లు, మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం పట్టణంలో జ్వరాల తీవ్రత ఎక్కువ లేదు.

– నవీన్, ధర్మపురి ఆస్పత్రి వైద్యుడు

జ్వరం బారిన గురుకులం విద్యార్థినులు



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మల్యాల(చొప్పదండి): మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో జ్వరం, దగ్గు, దురద వంటి వ్యాధులతో 50 మందికిపైగా విద్యార్థినులు ఇబ్బందులుపడుతున్నారు. సోమవారం మల్యాల మండల వైద్యుడు సంతోష్ ఆధ్వర్యంలో కళాశాలలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల పరిసరాల్లో దోమలు ఉన్నట్లు గుర్తించామని, ఫాగింగ్ చేపట్టడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని వైద్యుడు సూచించారు. 100 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 50 మంది విద్యార్థుల నుంచి రక్తం సేకరించి టీ హబ్‌కు పంపించారు.

క్లుప్తంగా

కవితకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జగిత్యాల నియోజకవర్గంపై చర్చించారు.

సంతోష్‌శాస్త్రికి పురోహిత రత్న అవార్డు



అవార్డును అందజేస్తున్న సినీనటుడు సుమన్

మెట్‌పల్లి : పట్టణంలోని మార్కండేయ ఆలయ పురోహితుడు సంతోష్‌శాస్త్రి వీరశైవ వైదిక పురోహిత రత్న అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో సీవీ రామన్ అకాడమీ సంస్కృతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సువర్ణ కంకణ ధారణ సాహిత్య ఉగాది సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సినీనటుడు సుమన్ చేతులమీదుగా సంతోష్ శాస్త్రి ఈ అవార్డును అందుకున్నారు.

వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతి

జగిత్యాల: జిల్లా కేంద్రంలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కోరుతూ చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషాకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యాం సుందర్, అంబటి భూమేశ్వర్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాకేంద్రంలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

దాడిచేసిన ఆరుగురిపై కేసు

జగిత్యాల క్రైం: జగిత్యాల – కరీంనగర్ రోడ్డులోని పద్మనాయక కల్యాణ మండపం వద్ద కోటగిరి సుమన్ అనే వ్యక్తిపై దాడిచేసిన శివ, సంపత్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కిశోర్ తెలిపారు. పట్టణ పరిధిలోని టీఆర్‌నగర్ గ్రామానికి చెందిన కోటగిరి సుమన్ మెట్‌పల్లికి చెందిన శివ, సంపత్ వద్ద అప్పు తీసుకున్నాడు. వారికి తీసుకున్న అప్పు చెల్లించడంలో కొంత ఆలస్యమైంది. సోమవారం సుమన్ ద్విచక్రవాహనంపై జగిత్యాలకు వెళ్తుండగా పద్మనాయక ఫంక్షన్ హాల్ వద్ద శివ, సంపత్‌తో పాటు మరో నలుగురు సుమన్ ద్విచక్రవాహనాన్ని లాక్కోని అతనిపై దాడిచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆమె ఆరోగ్యానికి భరోసా

- జిల్లాలో ఐదు ఆస్పత్రుల ఎంపిక
- ప్రతి మంగళవారం వైద్యసేవలు
- శిక్షణ పూర్తి చేసుకున్న వైద్యులు



నేరెళ్ల ప్రభుత్వ ఆస్పత్రి

రాయికల్(జగిత్యాల): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న 'ఆరోగ్య మహిళ' కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఐదు ఆస్పత్రులను ఎంపిక చేశారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ఆస్పత్రి చొప్పున ఎంచుకున్నారు. ఆయా ఆస్పత్రుల్లో ప్రతి మంగళవారం మహిళలకు అవసరమైన అన్నిరకాల వైద్య పరీక్షలు చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన ఆస్పత్రుల వైద్యాధికారులకు, సిబ్బందికి శిక్షణ పూర్తయింది. మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8 నుంచి ఆయా ఆసుపత్రుల్లో పరీక్షలు ప్రారంభించనున్నారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారిని మెరుగైన సౌకర్యాలు ఉన్న ఆసుపత్రులకు పంపించి ఇతర వైద్య పరీక్షలు చేయనున్నారు. ఈ ఆస్పత్రులకు ప్రత్యేక అధికారులను సైతం నియమించారు. మహిళలు సాధారణంగా ఎదుర్కొనే ఎనిమిది రకాల వ్యాధులకు సంబంధించి స్క్రీనింగ్, వైద్య పరీక్షలు, చికిత్సలపై వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది.

ఎంపిక చేసిన ఆస్పత్రులు

జిల్లాలో ఐదు ఆస్పత్రులను ఎంపిక చేశారు. ఇందులో చొప్పదండి నియోజకవర్గంలోని కొడిమ్యాల ఆస్పత్రి, ధర్మపురి నియోజకవర్గంలో నేరెళ్ల హాస్పిటల్, జగిత్యాల నియోజకవర్గంలో రాంవెల్ ఆస్పత్రి, కోరుట్లలోని అయిలాపూర్ దవాఖానా, వేములవాడ నియోజకవర్గం కథలాపూర్‌లోని ఆస్పత్రులను ఎంపిక చేశారు.

చేయనున్న పరీక్షలు

ఆయా ఆస్పత్రుల్లో మహిళలకు మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, ఇతర సాధారణ పరీక్షలు, ఓరల్, సర్వేకల్, రొమ్ము కేన్సర్ల స్క్రీనింగ్, అవసరమైన వారికి వైద్యం, పరికరాలు, మహిళా రేడియోగ్రాఫర్లు, స్టాఫ్ నర్సులు, రేడి యాలజిస్టులు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. థైరాయిడ్ పరీక్ష, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించడం, అయోడిన్ సమస్యలను గుర్తించడం, ఐరన్ లోపంతో పాటు విటమిన్ బీ12, విటమిన్–డీ పరీక్షలు చేసి మందులు అందజేస్తారు. మూత్ర కోశ సంబంధిత ఇన్ఫెక్షన్లు, పెల్విక్ ఇన్ఫ్లమేటరీ వ్యాధులకు సంబంధించి పరీక్షలు కూడా చేస్తారు. నెలసరి సమస్యలపై వైద్యం అందిస్తారు. సంతాన సమస్యలపై ప్రత్యేకంగా పరీక్షలు చేసి అవగాహన కల్పిస్తారు. అవసరమైనవారికి అల్ట్రాసౌండ్ పరీక్షలు చేస్తారు.

ఆరోగ్య సిబ్బందికి అవగాహన



జిల్లాలోని ఐదు ఆస్పత్రుల్లో ప్రతి మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. ఆయా నియోజకవర్గాల్లోని మహిళలు సంబంధిత ఆస్పత్రులకు వెళ్లి వారి అనారోగ్య సమస్యలను వైద్యుల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చు. గ్రామాల్లో మహిళలను చైతన్య పరిచి వైద్య పరీక్షలు చేయించుకునేలా ఆశ, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించాం.

– శ్రీనివాస్, డెప్యూటీ డీఎంహెచ్‌వో

ప్రజలను చైతన్యపరిచేందుకే జోడోయాత్ర

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాలటౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ వారిని చైతన్యపరిచేందుకే హాథ్ సే హాథ్ జోడోయాత్రను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి యాత్రలో పాల్గొని ప్రజలు విజయవంతం చేయాలన్నారు. ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యత్నిస్తున్నాయని తెలిపారు. ప్రజాసంక్షేమాన్ని మరిచిన బీఆర్ఎస్, బీజేపీలు ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టాయని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకే 'హాథ్ సే హాథ్' యాత్రను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 10న జిల్లా కేంద్రంలో నిర్వహించే యాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పాల్గొంటారని, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, పీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి బండ శంకర్, టీపీసీసీ సభ్యులు గిరి నాగభూషణం, నాయకులు కల్లెపెల్లి దుర్గయ్య,గాజుల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలకు ప్రాధాన్యతనివ్వాలి

- కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా

జగిత్యాలటౌన్: ప్రజావాణి సమస్యలకు అధిక ప్రాధాన్యతనిచ్చి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి పలు సమస్యలపై 36 ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యయప్రయాసాలకోర్చి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తారని, ప్రాధాన్యతతో సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మంద మకరంద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి చిన్నచిన్న సమస్యలు

జగిత్యాల: పక్కింటి కుక్క ఇబ్బందులకు గురిచేస్తుందంటూ ఓ వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. మొన్న జరిగిన ప్రజావాణిలో ఓ వ్యక్తి జగిత్యాల ప్రాంతంలో కింగ్‌ఫిషర్ బీర్లు దొరకడం లేదని ఫిర్యాదు చేశాడు. దీంతో ఇది ప్రజావాణేనా అన్న సంశయం అధికారులు వ్యక్తం చేస్తున్నారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన నారాయణ అనే ఇంటి పక్కన దశరథం అనే వ్యక్తి (వార్డు సభ్యుడు) ఇంట్లో కుక్కను పెంచుకుంటున్నాడని, ఎలాంటి వ్యాక్సినేషన్ వేయకపోవడంతో ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కుక్కపై చట్టపరమైన చర్యలు తీసుకుని కాపాడాలని కోరారు. దీంతో కలెక్టర్ యాస్మిన్‌బాషా మాట్లాడుతూ, ఇది ప్రజావాణి అని, మరీ ఇలాంటి ఫిర్యాదులు ఇవ్వడం సరికాదని, ప్రధాన సమస్యల కోసమే ప్రజావాణి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాగా ప్రజావాణి అంటే చులకనగా మారిందని, సమస్య ఏదైనా సరే కలెక్టర్ వద్దకు తీసుకువస్తున్నారని పలువురు చర్చించుకున్నారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని సుగ్లాంపల్లికి చెందిన బొడ్డు అర్జున్ (60) చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై ఉపేందర్‌రావు కథనం ప్రకారం.. అర్జున్‌కు ఫిట్స్ ఉంది. అప్పటినుంచి మానసిక్థితి సరిగ్గా లేదు. ఎక్కడపడితే అక్కడ తిరుగుతూ.. ఎదురొచ్చిన వారిని దుర్భాషలాడేవాడు. ఈనెల ఒకటిన సుల్తానాబాద్‌కు చెందిన ఓ వ్యక్తిని తిట్టడంతో అర్జున్‌ను కొట్టాడు. స్థానికులు 108లో ఆస్పత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ ఈనెల మూడున మృతిచెందాడు. అర్జున్ సోదరుడు బాపురాజ్ ఫిర్యాదుతో కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య



మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు

సుల్తానాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని ఆరెపల్లికి చెందిన చీకట్ల పోచమ్మ(70) వృద్ధురాలు సోమవారం ఉదయం బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. పోచమ్మ అనారోగ్యంతో, మతిస్థిమితం సరిగ్గా లేక ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. మృతురాలి కొడుకు కిష్టయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రావు



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ రావు

జగిత్యాల టౌన్ : రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని స్వశక్తికరణ్ అభియాన్ వర్క్‌షాప్ నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి చంద్రశేఖర్, జిల్లా నాయకులు పన్నాల తిరుపతి రెడ్డి, భూమి రమణ, పట్టణ అధ్యక్షుడు వీరబత్తిని అనిల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీని సన్మానించిన ప్రజాప్రతినిధులు

బుగ్గారం(ధర్మపురి): బుగ్గారం మండలం మద్దునూర్ వాసి, రాజ్యసభ సభ్యుడు దివకొండ దామోదర్‌రావు వ్యక్తిగత పని నిమిత్తం సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి రాగా స్థానిక ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సర్పంచ్ మూల సుమలత, వైస్ ఎంపీపీ సుచేందర్, ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు రహమాన్ శాలువాలతో సత్కరించారు. మూల శ్రీనివాస్‌గౌడ్, గాలిపెల్లి మహేష్, తహశీల్దార్ ఫారుఖ్ తదితరులున్నారు.

'కొండగట్టు' చోరీ కేసులో మరో ఇద్దరు..

- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 6 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం
- మరో ఇద్దరికోసం గాలింపు



కొండగట్టు ఆలయం

జగిత్యాల క్రైం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో గతనెల 23న అర్ధరాత్రి ఆలయంలో చొరబడి సుమారు 15 కిలోల వెండి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీసులు ఈ కేసును సవాల్‌గా తీసుకుని సీసీ ఫుటేజీలు, ఫింగర్‌ప్రింట్, డాగ్‌స్క్వాడ్, సంక్షిప్త పరిజ్ఞానంతో దొంగలను కర్నాటకలోని బీదర్ ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. ప్రత్యేక బృందాలు ముగ్గురు దొంగలను పట్టుకొని వారినుంచి సుమారు 5 కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఈనెల 1న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నలుగురి కోసం పోలీసులు కర్నాటకలో గాలింపు చర్యలు చేపట్టగా శనివారం రాత్రి మరో ఇద్దరు పోలీసులకు చిక్కారు. వారు ఎత్తుకెళ్లిన 6 కిలోల ఆభరణాలను ఓ వ్యాపారి వద్ద విక్రయించగా అతని నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని శనివారం రాత్రి జగిత్యాల జిల్లాకు తీసుకువచ్చినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. మరో ఇద్దరికోసం గాలింపు చర్యలు కొనసాగిస్తుండటంతో పాటు వివరాలను సేకరిస్తున్నారు.

అన్ని రంగాల్లో ముందుండాలి



ముందస్తు మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న నాయకురాళ్లు

- మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

వెల్గటూర్: మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి ఎల్ఎం ట్రస్ట్ చైర్‌పర్సన్ కొప్పుల స్నేహలత, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. మండలకేంద్రంలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు అన్నిరంగాల్లో ముందుండటం శుభపరిణామమన్నారు. అంతకుముందు కిషన్‌రావుపేట శ్రీ నాగపల్లి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కోటిలింగాల కోటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఎంపీపీ కూనమల్ల లక్ష్మీ, జెడ్పీటీసీ బి.సుధారాణి, వైస్ ఎంపీపీ ముస్కు కవిత తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల పంపిణీపై ప్రజావాణిలో ఫిర్యాదు



ప్రజావాణిలో కలెకర్‌కు ఫిర్యాదు చేస్తున్న గంగాజల

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్‌లోని రేషన్‌షాపులో ప్రస్తుతం రేషన్ సరకుల పంపిణీ రద్దు చేసినప్పటికీ ఓ మహిళ మళ్లీ నిత్యావసర సరకులు పంపిణీ చేస్తుందని, దీనిపై విచారణ జరపాలని కోరుతూ సాయిప్రసన్న మహిళా సంఘం అధ్యక్షురాలు తోడేటి గంగాజల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలోని రేషన్ షాపు అనధికారికంగా నిర్వహిస్తోందని, తమ గ్రూపులో సభ్యత్వం లేదని, అయినా సదరు మహిళకు సరకుల పంపిణీ బాధ్యతను అప్పగించారని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై విచారణ జరిపించాలని ఆమె కోరారు.

వ్యాయామ ఉపాధ్యాయుల క్రీడా పోటీల్లో ప్రతిభ



కరీంనగర్ డీఈవో చేతులమీదుగా పతకాలు అందుకుంటున్న రాజమల్లయ్య

వెల్గటూర్(ధర్మపురి): కరీంనగర్ జిల్లా స్థాయి వ్యాయామ ఉపాధ్యాయుల క్రీడా పోటీల్లో వెల్గటూర్ ఉన్నత పాఠశాల పీడీ రాజమల్లయ్య 4 పతకాలు గెలుచుకొని ప్రతిభ చాటాడు. కరీంనగర్ డీఈవో జనార్దన్‌రావు చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నాడు. ఈ నెల 3 నుంచి 4 వరకు కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి టోర్నమెంట్ కమ్ సెమినార్‌లో రాజమల్లయ్య పాల్గొన్నారు. అథ్లెటిక్స్‌లో 51 సంవత్సరాల పైబడిన విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్, లాంగ్‌జంప్‌లో వెండి, షాట్‌పుట్, డిస్కస్ త్రో లో కాంస్య పతకాలు గెలుచుకున్నాడు. ఈసందర్భంగా రాజమల్లయ్యను ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, జగిత్యాల డీఈవో జగన్మోహన్, ఎంఈవో బత్తుల భూమయ్య, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విశ్వప్రసాద్, ప్రధాన కార్యదర్శి అశోక్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కొండల్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

భవనంపై నుంచి పడి కార్మికుడికి గాయాలు

కోల్‌సిటీ: మెడికల్ కళాశాల భవనంపై నుంచిపడి రాందేవ్ అనే కార్మికుడు తీవ్ర గాయాల పాలైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఆదివారం ఒరిస్సాకు చెందిన రాందేవ్ మృతి ఘటన మరువకముందే మరో కార్మికుడు నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి కిందపడడంతో కాలువిరిగింది. దీంతో రాందేవ్‌ను ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

నమో రాజన్న



వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్నను సోమవారం భారీగా భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి కోడెమొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

వైభవం.. బ్రహ్మోత్సవం



వేంకటేశ్వరస్వామివారి ఊరేగింపు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



గోదావరిలో నీడలేక ఎండలో సేద తీరుతున్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రం నారసింహ నామంతో మారుమోగుతుంది. స్వామివారి సన్నిధిలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తుండగా, సోమవారం నాల్గో రోజుకు చేరాయి. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. కలియుగ దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామిని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. దారి పొడవున మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. స్థానిక ఇసుక స్తంభం వద్ద స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. కాగా భక్తుల సౌకర్యార్థం వేసిన చలువ పందిళ్లు సరిపోక చీరలతో గుడారాలు వేసుకొని సేద తీరుతున్నారు. గోదావరిలోని మంగలిగడ్డ పుష్కర ఘాటు భక్తులతో కిక్కిరిసి పోయింది. ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి భక్తులకు తనవంతు సేవలందించారు. కాగా బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజు మంగళవారం సాయంత్రం బ్రహ్మపుష్కరిణి కోనేరులో స్వామివార్ల దోలోత్సవ, తెప్పోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తారు. వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి సుమారు 50 వేల మంది భక్తులు రానున్నట్లు అధికారులు అంచనా వేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

Karimnagar Open Plots for sale of 200, 600 and 950 yards in good locations. Contact: 9989138420 [QA-1749]

SERVICES

ఋణాలు ఇవ్వబడును

ఎలాంటి ఆస్థి పత్రాలు లేకున్నా స్వంత ఇల్లు కలిగి ఆధార్, పాన్ కార్డు వున్న ప్రతి వారికి అతి తక్కువ వడ్డీతో ఋణాలు ఇప్పించబడును. సెల్: 9014653011 [K-1219964]

WANTED

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781924]

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190584]

ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకు ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. మరిన్ని వివరాలకు సంప్ర : 90800 07628 [L-537]

షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము, హైదరాబాద్‌లో పని చేయుటకు లేడీవార్డెన్స్, లేడీసూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు, వాచ్‌మెన్ కావలెను. Ph : 9391036931 / 9246585901 [HA-10360]

www.sakshi.com

For Classifieds, Advertisements Contact: 9951602933 9951602824

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.